# పారిపోయిన లెక్కల మాష్టారు

మొన్న హాఫియర్లీ పరీక్షలయిన తరువాత మా వాడికిచ్చిన ప్రోగ్రెస్ కార్డు చూసి మతిపోయింది నాకు. "సంతకం పెట్టండి నాన్నగారూ" అని వాడు బూట్ లేసులు బిగించుకోడంలో బిజీ అయిపోయాడు. "టైమవుతోంది కాబోల్లే" అనుకుంటూ సంతకం పెట్టేశాను. కాని కళ్ళు చురుగ్గా చదివేశాయి: మార్కులూ అరెండెన్సూను. అటెండెన్సు నూటికి ఎనభై తొమ్మిది. మార్కులు-లెక్కలలో ఇరవై నాలుగు. "ఇదేమిట్రా?" అన్నాను. "మా లెక్కల మేస్టారు డౌట్లడిగితే చెప్పరు" అన్నాడు, సంతకం అయిపోయింది కదా అన్న ధీమాతో కార్డందుకుని సంచిలో పెట్టేసుకుంటూను. వాడి మోహంలో మాత్రం కొంచమైనా తప్పు జరిగినట్టు భావం లేదు.

"ఇంటి దగ్గర శ్రద్ధగా చెప్పాలి" అన్న రిమార్కు రాసుంది. లెక్కల్లో మార్కుల కెదురుగా ఎర్రసిరాలో ఆ వాక్యం కళ్ళలో కదలాడింది.

ఆ తరువాత రెండు మూడు రోజుల వరకు ఆఫీసు పనితో "సాయం"కాలాలు వాడికి "సాయం" చెయ్యకుండానే గడిచిపోయాయి. నిన్న దొరికిపోయాడు. ఏదో మాసపత్రిక చదువుతూను.

"హోం వర్కు లేదా?"

"వుంది."

"మరేం, పత్రికలు చదువుతున్నావు?"

"అబ్బే, ఏదో జోకు నాన్నారూ" అంటూ తెచ్చాడు.

తండ్రి చెప్పాట్ట కొడుకుతో, "నాయనా, నీ కేదైనా తేలీకపోతే నన్నడుగు. మొహమాటపడకు" అని, అదొక బొమ్మ.

$Y = mx + c$ అన్నది వుపయోగించి $V = Ut + \frac{1}{2}att$ అని ఋజువు చెయ్యమన్న లెక్క చూపాడు కొడుకు. అది రెండో బొమ్మ.

తండ్రి మొహం తేలవేశాడు. అది మూడో బొమ్మ.

"ఏడిశావులే, ముందు నీ లెక్కల పుస్తకం తీ" అన్నాను చిరాగ్గా.

ఎగతాళి కనిపించే చిరునవ్వుతో చూశాడు నా వేపు. "లెక్కలు చేయడానికి బుద్ధి పుట్టడంలేదు నాన్నారూ!"

గట్టిగా కసిరి తీయించాను లెక్కల పుస్తకం. పేజీలు తిప్పి ఒక దగ్గర ఆగాడు.

"ఒక బాలుడు 12 సంవత్సరాల వయసు వచ్చేసరికి 1 మీటరు ఎత్తు ఎదిగాడు. 60 సంవత్సరాల వయసులో అతని ఎత్తు ఎంత?"

"దీనికేముంది? 60ని 12 పెట్టి భాగారిస్తే-" అని ఆగాను. "ఊ ఇంకోటి?"

"ఒక మనిషి రాత్రిపూట ప్రయాణం చేయుచూ ఒక లాంతరు సహాయమున గంటకు 5 కిలోమీటర్లు నడుచును. 4 లాంతర్ల సహాయమున అతడు గంటకెంత దూరము పోవును?"

ఇది మామూలు లెక్కా లేకపోతే బ్రెయిన్ టీజరా అని అనుమానం వచ్చింది.

"ఒక నీటి కుండీకి నింపే పంపు ఒకటి, ఖాళీచేసే గొట్టాలు రెండు వున్నాయి. నింపే పంపు కుండీని మూడు గంటలలో నింపును. ఖాళీచేసే గొట్టాల్లో ఒకటి తెరిస్తే ఆరు గంటల్లోను, రెండోది తెరిస్తే ఎనిమిది గంటల్లోను కుండీ ఖాళీ అవుతుంది. మూడూ ఆన్‌చేసి మూడు గంటలసేపు వుంచి అప్పుడు మూడూ కట్టేస్తే కుండీలో ఎన్ని నీళ్లుంటాయి?"

"దీంట్లో ఏమీ అసందర్భం లేదే" అన్నాను.

"ఇది చూడండి" అని ఫిజిక్సు పుస్తకం తీశాడు. నీళ్ళ కుండీలోంచి నీళ్ళు గొట్టాలద్వారా బయటికి పోయేటప్పుడు కుండీలో వుండే నీటి లెవెల్‌ని బట్టి, వాతావరణ పీడనాన్ని బట్టి కుండీ ఖాళీ అవుతుంది గాని, ఖాళీచేసే గొట్టం కెపాసిటీని బట్టి కాదు. అని చెప్పడానికి దిక్కుమాలినంత ఫార్ములా బోధపరిచారు అందులో.

"అది ఫిజిక్సు. ఇది లెక్కలు. అది చదివినప్పుడు ఇదీ, ఇది చదివినప్పు డదీ పట్టించుకోకూడదు" అన్నాను; ఓడిపోయానని ఒప్పుకోడానికి యిష్టంలేక.

"అలా అయితే ఫిజిక్స్ చదివేటప్పుడు ఎక్కాలు, కొట్టివేతలు, కలపడాలు మరిచిపోవచ్చా?" అన్నాడు వాడు.

ఇంకో అధ్యాయంలో ఇంకో రకం లెక్కవుంది:

"ఒక నూనె వ్యాపారి కిలో ఏడున్నర రూపాయల చొప్పున నంద్యాల నూనె టోకున కొని, దాంట్లో లీటరు రు. రెండున్నర చొప్పున కొన్న డీజిల్ ఆయిల్ కలిపి మొత్తం నూనె కిలో ఎనిమిది రూపాయల పావలా చొప్పున అమ్మగా అతనికి 100 కేజీలకి రు. 420 లాభం వచ్చింది. అతను వేరుశనగ నూనె డీజిల్ ఆయిల్ ఏ నిష్పత్తిలో కలిపాడు అని లెక్క చదివి అనువాదం చేశాను.

ఈ లోగా సివిక్సు పుస్తకం తీశాడు. ఆహార పదార్థాలు కల్తీ చెయ్యడం ఎంత బాధ్యతారహితమైన పనో, ఎంత ఘోరమైన దేశ ద్రోహమో వివరంగా వున్న పాఠం చూపించాడు.

పసివాడి మనసులో కలుగుతున్న కల్లోలాన్ని గమనిస్తూనే వాడు మేటరాఫ్ ఫాక్టుగా వుండలేకపోతున్నాడని చికాకుపడ్డాను. మిశ్రమాల లెక్కలన్నిట్లోనూ కల్తీలే. బియ్యంలో రాళ్ళు కలపడం, పాలల్లో నీళ్ళు కలపడం, కందిపప్పులో.... పప్పు కలపడం ("అది చాలా ప్రాణాపాయం. అలాంటి పప్పు పండించకుండా చేను చేనునే ధ్వంసం చేయించగలరు; గ్రామాధికారులు తలచుకుంటే. కాని అది పండుతూనే వుంది. దానికోసం కొంత సేద్యభూమి వినియోగపడుతూనే వుంది. ఏటా కొందరు చస్తున్నారు, లేదా అంగవైకల్యం పొందుతున్నారు) ఇలాంటి కల్తీ లెక్కలున్నాయి.

"ఈ లెక్కలు రీజనబుల్‌గా లేవు నాన్నారూ. అందుకే నాకు వాటిని చెయ్యాలనిపించడంలేదు."

నేను ఆలోచించాను. మిగిలిన సబ్జక్టుల్లో వుదాహరణలు, వివరణలు కొంతకాకపోతే కొంతైనా నిజానికి దగ్గరగా వుంటున్నాయి.

"లెక్కలు మానేస్తాను నాన్నారూ" అన్నాడు మా వాడు.

పక్కింటివాళ్ళ పాప; "మీకు ఫోనొచ్చిందండీ" అంటే లేచి వెళ్ళాను. మళ్ళీ "లెక్కలు చెయ్యరా" అని మా వాడితో అన్లేదు.

(16-9-78)